సంక్రాంతికి ఊరెళ్తున్నారా.. జాగ్రత్త!



కుషాయిగూడ: సంక్రాంతి పండుగ సందర్భంగా చోటుచేసుకునే దొంగతనాలపై కుషాయిగూడ పోలీసులు అవగాహన చేపట్టారు. ఆటోతో ప్రచారం నిర్వహిస్తూ.. ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. సొంతూళ్లకు వెళ్లేవారు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కుషాయిగూడ డీఐ సాయిప్రకాశ్‌గౌడ్ సోమవారం పలు కాలనీల్లో అవగాహన కల్పించారు. ఇళ్లకు తాళాలు వేసేవారు సమీప పోలీస్‌స్టేషన్‌లో సమాచారం ఇవ్వడం, ఇరుగుపొరుగు వారిని అప్రమత్తం చేయడం, అలారాలు, సీసీ కెమెరాల ఏర్పాటు వంటి జాగ్రత్తలను వివరించారు. ఎస్సై భద్రయ్య సిబ్బంది ఉన్నారు.

కనుల పండువగా వేంకటేశ్వరుడి ప్రతిరూపం





మల్కాజిగిరి: ఆనంద్ బాగ్‌లోని లక్ష్మీవేంకటేశ్వర దేవస్థానంలో ధనుర్మాస పూజలు ఘనంగా జరుగుతున్నాయి. వివిధ పూజలతో విశేష పూజాకార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ఆలయ ఈఓ రవీందర్‌రెడ్డి, ప్రధాన అర్చకులు ముడుంబై వెంకటరమణాచార్యులు తెలిపారు. సోమవారం సుమారు 66 రకాల డ్రైఫ్రూట్స్, 23 రకాల ఇతర పండ్లతో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. 10వ తేదీ పుష్పయాగం, 12న కూడార్రై ఉత్సవం, 13న శ్రవణానక్షత్రం సందర్భంగా చందనసేవ, 14న గోదారంగనాథుల కల్యాణంతో ధనుర్మాస పూజలు ముగుస్తాయని వివరించారు.

అల్వాల్ మేరు సంఘం అధ్యక్షుడిగా చంద్రశేఖర్



రాపర్తి చంద్రశేఖర్‌ను సత్కరిస్తున్న సంఘం సభ్యులు

అల్వాల్: మేరు సంఘం అల్వాల్ జోన్ ఎన్నికలు లోతుకుంటలోని కార్యాలయంలో నిర్వహించారు. సంఘం అధ్యక్షుడిగా రాపర్తి చంద్రశేఖర్‌ను సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మేరు సంఘం సభ్యుల సంక్షేమం, అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానన్నారు. తనపై నమ్మకంతో అధ్యక్షుడిగా ఎన్నుకున్నందుకు సంఘం సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. దీకొండ వెంకటేష్, మాడిశెట్టి బాలయ్య, సోమ కొండయ్య, రామగిరి బిక్షపతి, కీర్తి సుధాకర్, గణేష్, కరణ్, మంతెన సంతోష్, ప్రభాకర్, చందు, సత్యనారాయణ, శీలం సంతోష్, కృష్ణ, గోపి, వినోద్, ప్రవీణ్, గంగాధర్, కిషన్, శ్రీనాథ్, సత్యనారాయణ, కృష్ణ, రామస్వామి, బాలనర్సయ్య, శేఖర్, ఓంరాజ్, రవీందర్, వసంతయ్య, రవి పాల్గొన్నారు.

విద్యార్థులు అన్నిరంగాల్లో రాణించాలి



బోడుప్పల్: విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించేందుకు కృషి చేయాలని విద్యాజ్యోతి ఉన్నత పాఠశాల డైరెక్టర్ శ్రావణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. మేడ్చల్ జిల్లా ఎన్‌జీసీ (ఏకోక్లబ్), డీఈఓ విజయకుమారి, జిల్లా కో–ఆర్డినేటర్ శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యామ్నాయం, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ అనే అంశంపై ఏకపాత్రాభినయం, నాటిక పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో చెంగిచర్ల విద్యాజ్యోతి ఉన్నత పాఠశాల 9వ తరగతి విద్యార్థిని మైథిలీ ఏకపాత్రాభినయంలో రూ. 500లు నగదు బహుమతి గెలుపొందారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తమ పాఠశాలలోని విద్యార్థులను చదువుతోపాటు అన్ని రంగాల్లో రాణించేలా ప్రోత్సహిస్తున్నట్లు వివరించారు. పాఠశాల డైరెక్టర్ అనిల్ అయ్యంగార్, ప్రిన్సిపల్ నీలిమా, మాస్టర్లు సాయికుమార్, వైష్ణవి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గుర్రపు డెక్క తొలగింపు



తొలగింపు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ శాంతి సాయిజెన్‌శేఖర్

మల్లాపూర్: నాచారం పటేల్‌కుంట చెరువులోని గుర్రపు డెక్క తొలగింపు పనులు ప్రారంభమయ్యాయి. ఈ పనులను సోమవారం జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యులు, నాచారం కార్పొరేటర్ శాంతి సాయిజెన్‌శేఖర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. చెరువులోని గుర్రపు డెక్కను పూర్తిగా తొలగించి దోమల సమస్య లేకుండా చేస్తామని వివరించారు. పటేల్‌కుంట చెరువు అనంతరం హెచ్ఎంటీనగర్ చెరువులోని ఆకును కుడా తొలగిస్తామని తెలిపారు. చెరువులోని వ్యర్థాలు, డెక్కను తొలగించడం కోసం 25 మంది ఎంటమాలజీ సిబ్బంది ఏర్పాటు చేయడం జరిగిందని పేర్కొన్నారు. ఎంటమాలజీ సూపర్‌వైజర్ నరసింహా, జంగం అశోక్, ఆశన్న, వాసు, కట్ట బుచ్చన్నగౌడ్, విష్ణు, తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదిగితేనే సమాజ ప్రగతి

రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ డాక్టర్ వకుళాభరణం



సిబా అవార్డులను అందజేస్తున్న వకుళాభరణం కృష్ణమోహన్‌రావు

హబ్సిగూడ: ఔత్సాహిత పారిశ్రామికవేత్తలుగా మహిళలు ఎదిగితేనే సమాజం పురోగమనం సాధిస్తుందని రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు అన్నారు. 'సౌత్ ఇండియా ఇన్ఫ్లూఎన్సెర్స్ అండ్ బ్లాగర్స్' అవార్డు ప్రధానోత్సవం సోమవారం హబ్సిగూడ వీధి నెంబర్–4 సౌత్ ఇండియా బ్రైడల్ మేకప్ అండ్ మోడలింగ్ స్టూడియో ఆడిటోరియంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వకుళాభరణం హాజరై తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్రలకు చెందిన ప్రముఖ మహిళా పారిశ్రామికవేత్తలకు అవార్డులను ప్రదానం చేశారు. ఆయన మాట్లాడుతూ.. కృషి, పట్టుదల, లక్ష్యం దిశగా ఏ రంగాల్లోనైనా జీవితంలో పురోగమించడం అసాధ్యం కాదన్నారు. ఉద్యోగాల కోసం ఎదురుచూస్తూ.. కాలం వృధా చేసుకోవద్దని స్వయంకృషితోనే రాణించాలని సూచించారు. మహిళలు ఆర్థికంగా ఎదిగితేనే సమాజ ప్రగతి సాధ్యమన్నారు. జాతీయ బీసీదళ్ అధ్యక్షుడు దుండ్ర కుమారస్వామి, మిస్సెస్ ఆసియా పసిఫిక్ సుధాజైన్, భారత బ్యాడ్మింటన్ క్రీడాకారిణి నవ్యారావు, వ్యక్తిగత వికాస నిపుణురాలు ప్రొఫెసర్ సీహెచ్.రేఖారావు, బ్యూటీషియన్ ప్రీతిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

'ప్రజావాణి'కి ఫిర్యాదుల వెల్లువ

- తొలిరోజు అక్రమ నిర్మాణాలు, టాక్స్ విభాగాలపై..
- అధికారుల తీరుపై కార్పొరేటర్



అల్వాల్ సర్కిల్ కార్యాలయంలో ఫిర్యాదులను స్వీకరిస్తున్న డీసీ శ్రీనివాస్‌రెడ్డి



అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదు చేసేందుకు వచ్చిన కాలనీ వాసులు



అధికారులపై ఫిర్యాదు చేస్తున్న కార్పొరేటర్ శ్రవణ్

ఉప్పల్ : ఉప్పల్ సర్కిల్ కార్యాలయంలో తొలిరోజు ప్రజావాణిలో ఆక్రమ నిర్మాణాలు, ఇంజినీరింగ్, టాక్స్ విభాగాలపై ఫిర్యాదులు వచ్చాయి. సంబంధిత అధికారులు ప్రజావాణిలో అందుబాటులో లేకపోవడంతో పొంతనలేని సమాధానాలు చెప్పడంతో ఆగ్రహించిన కాలనీవాసులు అధికారులను నిలదీశారు. సర్కిల్ పరిధిలో అన్ని డివిజన్లలో అక్రమ నిర్మాణాలను అడ్డుకోవాల్సిన అధికారులు వారికి అండగా ఉంటూ.. ప్రోత్సహిస్తున్నారని అరోపించారు. సోమవారం ప్రజావాణి ఉందన్న సమాచారంతో ఆదర్శ్‌నగర్, సాయిరాం నగర్, గణేష్ నగర్, శ్రీనివాసహైట్స్, కావేరినగర్, సెవన్‌హిల్స్ కాలనీల అసోసియేషన్ల ప్రతినిధులు ఉప్పల్ సర్కిల్ కార్యాలయంలో నిర్వహిస్తున్న ప్రజావాణిలో తమ ఫిర్యాదులతో వినతిపత్రాన్ని అధికారులకు అందజేశారు. ఉప్పల్ నుంచి చిలుకానగర్ రహదారి మాస్టర్ ప్లాన్‌లో ఉన్నందున 100 ఫీట్ల తర్వాతే నిర్మాణాలకు అనుమతులు ఇవ్వాలని, అనుమతులు ఒక తీరుగా నిర్మాణాలు రోడ్డు మీద నిర్మిస్తున్నా.. అధికారులు అడ్డుకోవడం లేదని వారు నిలదీశారు. అక్రమ నిర్మాణాలపై తగిన చర్యలు తీసుకోకపోతే సర్కిల్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని స్థానికులు హెచ్చరించారు.

కార్పొరేటర్ ఫిర్యాదు..

మల్కాజిగిరి: మల్కాజిగిరి సర్కిల్ పరిధిలో ప్రజావాణి కార్యక్రమంలో రెండు ఫిర్యాదులు అందాయని మల్కాజిగిరి సర్కిల్ జి.రాజు చెప్పారు. ఇంజినీరింగ్ విభాగం, ఆస్తిపన్ను విభాగంలో ఒక్కొక్క ఫిర్యాదు అందిందన్నారు. సంబంధిత విభాగం అధికారులు ఫిర్యాదులను పరిశీలించి పరిష్కరిస్తారన్నారు. ప్రతి సోమవారం జరిగే ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

కార్పొరేటర్, ఈఈకి వాగ్వాదం..

ప్రజావాణిలో మల్కాజిగిరి కార్పొరేటర్ శ్రవణ్, ఈఈ లక్ష్మణ్‌కు వాగ్వాదం చోటుచేసుకుంది. 'ఆరు మంది కార్పొరేటర్లు ఉన్నా.. మీ ఒక్కరి దగ్గరే సమస్యలు ఉన్నట్లుగా చెప్పుతున్నారని' ఈఈ అనడంతో కార్పొరేటర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. 'కార్యాలయంలో కూర్చొని ఉంటే సమస్యలు కనపడవని క్షేత్రస్థాయిలోకి వస్తే సమస్యలు చూపిస్తానన్నారు'. పనులు చేయడానికి నిధులు మంజూరైనా ప్రారంభించడం లేదని, ఇంజినీరింగ్ విభాగం అధికారులను అడిగితే ఎన్నికల కోడ్, ప్రజాపాలన అంటూ కాలయాపన చేస్తున్నారే తప్పా.. ప్రారంభించడం లేదని డీసీకి ఫిర్యాదు చేశారు. ప్రభుత్వం కీలమైన కార్యక్రమంగా ప్రజావాణి గురించి చెబుతుంటే అధికారులు హాజరుకావడం వారికున్న శ్రద్ధ తెలియజేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

అల్వాల్ సర్కిల్ కార్యాలయంలో..

అల్వాల్: జీహెచ్ఎంసీ అధికారుల ఆదేశానుసారం సోమవారం అల్వాల్ సర్కిల్ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమం పునరుద్ధరింపచేశారు. అల్వాల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి ప్రజల నుంచి వచ్చిన అర్జీలను స్వీకరించారు. ప్రజావాణిలో అందిన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని వివరించారు. ఈఈ రాజు, ఏసీపీ సాంబయ్య, సూపరిండెంట్ స్వామి, ఆర్టికల్చర్ అధికారిణి ప్రవీణ, శానిటేషన్ సూపర్‌వైజర్ ప్రభాకర్, ఏఈ లక్ష్మీప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

ఉప్పల్: అభివృద్ధి పనుల నాణ్యతలో కాంట్రాక్టర్లు, అధికారులు రాజీపడొద్దని చిలుకానగర్ డివిజన్ కార్పొరేటర్ బన్నాల గీతాప్రవీణ్ ముదిరాజ్ అన్నారు. రూ. 50 లక్షల అంచనా వ్యయంతో నిర్మిస్తున్న సీసీరోడ్డు పనులను సోమవారం అధికారులు, స్థానికులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అభివృద్ధి పనులు పదికాలాల పాటు మన్నికగా ఉండేలా తగిన చర్యలు తీసుకోవాలని, నాణ్యత ప్రమాణాల విషయంలో రాజీ పడొద్దని సూచించారు. బీఆర్ఎస్ నేతలు బన్నాల ప్రవీణ్, బింగి శ్రీనివాస్, కొండల్‌రెడ్డి, జగన్ తదితరులున్నారు.

శుభాకాంక్షలు



హరీష్‌రావుతో జగదీష్‌గౌడ్, మంజులగౌడ్

మల్కాజిగిరి: మాజీమంత్రి హరీష్‌రావును మల్కాజిగిరికి చెందిన మాజీ కార్పొరేటర్లు జగదీష్‌గౌడ్, మంజులగౌడ్ మర్యాద పూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి గెలుపునకు కృషి చేసిన వారిని ఆయన ఈ సందర్భంగా అభినందించారు.

కాలనీ సైన్‌బోర్డుల ప్రారంభం



ప్రారంభించిస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ ప్రభుదాస్

కుషాయిగూడ: మీర్‌పేట్–హెచ్‌బీకాలనీ డివిజన్, తిరుమలనగర్ కాలనీలో ఏర్పాటు చేసిన సైన్‌బోర్డులను ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, స్థానిక కార్పొరేటర్ ప్రభుదాస్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన మాట్లాడుతూ.. కాలనీలో సైన్ బోర్డులు ఏర్పాటు అభినందనీయమన్నారు. అడ్రస్ సులభంగా గుర్తించడంతో పాటుగా అత్యవసర సమయాల్లో ఘటన స్థలాలకు త్వరగా చేరుకునేందుకు దోహదపడతాయన్నారు. అనంతరం కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులతో మాట్లాడారు. కాలనీలో నెలకొన్న సమస్యలను తన దృష్టికి నేరుగా తీసుకొచ్చి పరిష్కారించుకోవాలన్నారు. మౌలిక వసతులైన తాగునీరు, డ్రైనేజీ, రోడ్ల నిర్మాణాలు వంటి సమస్యలు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. మాజీ కార్పొరేటర్ గుండారపు శ్రీనివాస్‌రెడ్డి, కాలనీ అధ్యక్షుడు మల్లేష్‌గౌడ్, సెక్రటరీ అమరేందర్‌బాబు, ముత్యం వెంకన్నగౌడ్, చంద్రశేఖర్, శ్రీనివాసరావు, దాసు, రాజు, రఫీక్, జైపాల్‌నాయుడు, మురళీకృష్ణ, శశికళ తదితరులు పాల్గొన్నారు.

కాపు ప్రతినిధులపై కేసు

న్యాయవాది సుంకర నరేష్‌పై చేసిన వ్యాఖ్యలకు చర్యలు

కుషాయిగూడ: న్యాయవాది సుంకర నరేష్‌పై కాపు కులాల ఐక్యవేదిక ప్రతినిధులు చేసిన ఆరోపణలపై విచారణ చేసిన కోర్టు కాప్రా కాపు కులాల ఐక్యవేదిక అధ్యక్షుడు, రెడ్డి శ్రీనివాసరావుతో పాటు మరో ఐదుగురిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని కోర్టు తీర్పునిస్తూ.. కుషాయిగూడ పోలీసులను ఆదేశించింది. కాప్రా కాపు కులాల భవనం కోసం గత ప్రభుత్వం రూ.700 కోట్ల విలువ చేసే స్థలాన్ని రూ.700లకు కేటాయించడాన్ని తప్పుబడుతూ.. ఇది రాజ్యాంగ విరుద్ధమని హైకోర్టులో ఫిల్ వేశారు. కోట్లాది రూపాయల విలువ చేసే స్థలాన్ని స్వాధీనం చేసుకోవాలంటూ తన వాదనను వినిపించాడు. దీనిపై స్పందించిన కాపు కులాల ఐక్యవేదిక ప్రతినిధి లక్కాకుల శ్రీనివాసరావు కాప్రా కాపు కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. న్యాయవాది సుంకర నరేష్‌ను కుల బహిష్కరణ చేయాలని, కాపు కుల ద్రోహి అంటూ.. పోస్టర్లను ప్రదర్శించారు. విషయం తెలిసిన కాప్రా కాపు కులాల ఐక్యవేదిక అధ్యక్షుడు రెడ్డి శ్రీనివాసరావు సుంకర నరేష్ కులద్రోహిగా ముద్రపడ్డాడని, కుల కార్యక్రమాలకు అతడిని దూరంగా ఉంచుతామంటూ.. హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించాడు. ఈ విషయంపై న్యాయవాది నరేష్ కోర్టును ఆశ్రయించడంతో విచారణ జరిపిన కోర్టు తదుపరి చర్యలకు కుషాయిగూడ పోలీసులకు ఆదేశాలు జారీ చేసింది. దీంతో కోర్టు అనుమతితో వారిపై 506 సెక్షన్ కింద కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్లు ఎస్సై షఫీ తెలిపారు.

శబరిమలైకి అయ్యప్పలు



గౌతంనగర్: గౌతంనగర్ డివిజన్ సంతోష్‌నగర్‌కు చెందిన రాజుముదిరాజ్ గురుస్వామి ఆధ్వర్యంలో సోమవారం పలువురు స్వాములు శబరిమలైకి తరలివెళ్లారు. అయ్యప్ప నామస్మరణ చేస్తూ.. శబరియాత్రను ప్రారంభించారు. అయ్యప్పస్వాములు భాస్కర్, శ్రీధర్, శివ, శ్రీనివాస్, ఉపేందర్ పాల్గొన్నారు.

వృత్తిదారులకు పెన్షన్ ఇవ్వాలి

వంగపల్లి శ్రీనివాస్‌మాదిగ, ఓయూ ప్రొఫెసర్ కాశీం



ఎమ్మార్పీఎస్ రాష్ట్రకార్యవర్గ సమావేశంలో అభివాదం చేస్తున్న దృశ్యం

హబ్సిగూడ: హబ్సిగూడలోని సుప్రభాత్ హోటల్‌లో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. సోమవారం జరిగిన ఈ కార్యక్రమానికి ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్‌మాదిగ, ఓయూ ప్రొఫెసర్ కాశీంలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సామాజిక న్యాయం జరగాలంటే ఉద్యమించాలన్నారు. డప్పు, చెప్పు వృత్తిదారులకు పెన్షన్ ఇవ్వాలని, పారిశుద్ధ్య కార్మికులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. వర్గీకరణతోనే సామాజిక న్యాయం జరుగుతుందని, అన్ని ఉపకులాలకు న్యాయం జరిగేలా చూడా లన్నారు. ప్రభుత్వం స్పందించి డిమాండ్లను అంగీకరించాలని కోరారు. కోర్ కమిటీ సభ్యులు మీసాల మల్లేష్, బల్లర్ హుస్సేన్, చిలకమరి గణేష్, మేరి, పాలడుగు శ్రీనివాస్, డప్పు శివరాజ్, కృష్ణ, శ్రీను, వేణు, ఎంఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కొల్లూరు వెంకటేష్, ఇల్లందుల రాజేష్ కన్నా, బొల్లం జ్యోతి, రజిని, వరలక్ష్మి, లక్ష్మమ్మ, చిన్నస్వామి, నరేష్, నందకిషోర్, నరేందర్, శాంతి, కిరణ్, రఘు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మల్లాపూర్: నాచారం సెక్షన్ 11 కేవీ ఫీడర్ పరిధిలోని టెక్‌పార్క్ సబ్‌స్టేషన్ పరిధిలో మంగళవారం ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు రాధా ఐరన్ ఫీడర్, హరియాణా ఫీడర్‌లలో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు నాచారం విద్యుత్ ఏఈ నాగరాజు తెలిపారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు టెక్‌పార్క్ బాలజీ ఫీడర్, రాహేజా ఫీడర్ పరిధిలో విద్యుత్ సరఫరా ఉండదని వినియోగదారులు సహకరించాలని కోరారు.

అభినందన



మల్కాజిగిరి: కేంద్ర సెన్సార్‌బోర్డు సభ్యుడిగా నియమితులైన మల్కాజిగిరికి చెందిన బీజేపీ సీనియర్ నాయకుడు డాక్టర్ నర్సింహగౌడ్‌ను కార్పొరేటర్ శ్రవణ్, పార్టీ నాయకులు రాంబాబు, డీఎస్ వెంకటేష్, ఆనంద్‌లు కలిసి అభినందించారు.

కానుకల పంపిణీ



మతపెద్దలకు కానుకలను అందజేస్తున్న కార్పొరేటర్ సునీత

గౌతంనగర్: రాష్ట్ర ప్రభుత్వం అందించే క్రిస్మస్‌కిట్లను గౌతంనగర్‌లో కార్పొరేటర్ మేకల సునీతా రాముయాదవ్ పలువురు పాస్టర్లు, క్రైస్తవ మత పెద్దలకు అందజేశారు. సోమవారం జరిగిన ఈ కార్యక్రమంలో పాస్టర్లు ప్రసాద్ రెవరెండ్, ఏలియా, శ్రీనివాస్, బీఆర్ఎస్ నాయకులు రాముయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీలను అమలు చేస్తాం

బోడుప్పల్: ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తోటకూర వజ్రేష్‌యాదవ్ అన్నారు. బోడుప్పల్‌లో సోమవారం ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన నెల రోజుల్లో రెండు హామీలను అమలు చేసిందన్నారు. పదవులు కోల్పోయిన బీఆర్ఎస్ మాజీ మంత్రులు కేటీఆర్, హరీష్‌రావులు ప్రజలను రెచ్చగొట్టేలా మాట్లాడుతున్నారని ఆరోపించారు. గతంలో బీఆర్ఎస్ పార్టీ ఎన్నో హామీలు ఇచ్చిందని, వాటిలో ఒక్కటి కూడా అమలు చేయలేదని విమర్శించారు. 100 రోజుల్లో ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేస్తామని స్పష్టం చేశారు. బోడుప్పల్ కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు పోగుల నర్సింహ్మారెడ్డి, ప్రధాన కార్యదర్శి విశ్వేశ్వర్‌గుప్తా పాల్గొన్నారు.

అమ్మవారి శేష వస్త్రాల బహిరంగ వేలం

రామంతాపూర్ : శ్రీనివాసపురంలోని కోదండ రామలింగేశ్వరస్వామి దేవస్థానంలో అమ్మవారికి భక్తులు సమర్పించిన శేషవస్త్రాలను ఈనెల 10 నుంచి ఫిబ్రవరి 28వ తేదీ వరకు బహిరంగ వేలం ద్వారా విక్రయిస్తున్నామని ఆలయ చైర్మన్ కంది ఆగిరెడ్డి, ఎగ్జిక్యూటివ్ అధికారి వెల్లంకి నరేందర్ సోమవారం తెలిపారు. ఆసక్తి కలిగిన వారు ఆలయ ప్రాంగణంలోని కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

అభివృద్ధి పనులపై ఎమ్మెల్యే సమీక్ష



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

అల్వాల్: అల్వాల్ డివిజన్ పరిధిలో పెండింగ్ పనులు, ప్రతిపాదించాల్సిన అభివృద్ధి పనులపై సోమవారం మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి, కార్పొరేటర్ శాంతిశ్రీనివాస్‌రెడ్డి, ఆర్అండ్‌బీ, జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డివిజన్ పరిధిలో నెలకొన్న సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. డివిజన్ పరిధిలో మిగిలిన పెండింగ్ పనులను పూర్తి చేయాలని ఆయన సూచించారు. రాముయాదవ్, అనిల్‌కిషోర్, పరుశురాంరెడ్డి, డోలి రమేష్, పరమేష్, ఆర్అండ్‌బీ, జీహెచ్ఎంసీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో సోషల్ ఇన్నొవేషన్ ఛాలెంజ్





ఎగ్జిబిట్స్‌లో జన్యా ఫౌండేషన్ ప్రతినిధులు, హెచ్ఎం శోభారాణి ,రంగోళిలో పాల్గొన్న విద్యార్థినులు


కుషాయిగూడ: జన్యా ఫౌండేషన్ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని చర్లపల్లి ప్రభుత్వ పాఠశాలలో సోషల్ ఇన్నోవేషన్ ఛాలెంజ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సోమవారం నిర్వహించిన సైంటిఫిక్ రంగోళి, క్రియేటివ్ ఫెయిర్‌లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను కనబరిచారు. పునరుత్పాదక శక్తి, వ్యర్థాల నిర్వహణ, ఆరోగ్యం, పరిశుభ్రతతో పాటు సామాజిక అంశాలపై విద్యార్థులు రూపొందించిన ప్రదర్శించిన ఎగ్జిబిట్స్ ఆలోచింపజేశాయి. విద్యార్థినులు రంగోళిలో వేసిన ముగ్గులు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం శోభారాణి మాట్లాడుతూ.. ఇలాంటి వైజ్ఞానిక కార్యక్రమాలతో విద్యార్థుల్లో దాగి ఉన్న సృజన వెలికివస్తుందన్నారు. జన్యా ఫౌండేషన్ ప్రతినిధులు రామ్, రఘు తదితరులు పాల్గొన్నారు.

కరాటేలో సత్తాచాటిన విద్యార్థులు



బోడుప్పల్: న్యూఢిల్లీలో జరిగిన దక్షిణాసియా కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో బోడుప్పల్‌కు చెందిన విద్యార్థులు సత్తా చాటినట్లు కరాటే మాస్టర్ నవీన్‌కుమార్ తెలిపారు. సోమవారం బోడుప్పల్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఈ పోటీల్లో రెండు వేలమంది విద్యార్థులు పాల్గొనగా.. బోడుప్పల్‌కు చెందిన సాయిప్రియ, సమీక్ష, భవన్‌కుమార్, సహస్ర తేజు, భువన్‌తేజ్, తేజస్వి, నిత్య, సంజన స్వర్ణపతకాలు, ఆదిత్య, రియాన్ష్, కార్తీక్, వైష్ణవి, రజత పతకాలు, భువనేష్ బ్రౌన్ మెడల్స్ సాధించినట్లు వెల్లడించారు. ఈ చాంపియన్‌షిప్‌లో పతకాలు సాధించిన విద్యార్థులు నార్వే దేశంలో జరిగే స్వీయరక్షణ శిబిరానికి ఎంపికైనట్లు మాస్టర్ నవీన్‌కుమార్ వెల్లడించారు. గెలుపొందిన విద్యార్థులను ఈ సందర్భంగా ఆయన అభినందించారు.

ఉప్పల్ నియోజకవర్గ ఓటరు లిస్ట్ తుది జాబితా



ఉప్పల్: ఓటరు లిస్ట్ తుదిజాబితాను అధికారులు వెల్లడించారు. 2024 జనవరి 6 వరకు గల ఓటర్ల తుది జాబితా ఈ విధంగా ఉంది. ఉప్పల్ నియోకజవర్గ పరిధిలో 407 పోలింగ్ స్టేషన్లలో 5,33,149 ఓటర్లు ఉన్నట్లు ప్రకటించారు. వీరిలో పురుషులు 2,76,890 ఉండగా.. మహిళలు 2,56,221 మంది ఉన్నారు. ఇతరులు 38 మంది ఓటర్లు ఉన్నారు. కాప్రా సర్కిల్ పరిధిలో సర్కిల్ పరిధిలో 236 పోలింగ్‌స్టేషన్లలో 1,61,262 పురుషులు, 1,49,624 మంది మహిళా ఓటర్లు, ఉప్పల్ సర్కిల్‌లో 171 పోలింగ్ స్టేషన్లు ఉండగా.. 1,15,628 మంది పురుషులు, 1,06,597 మంది మహిళలు ఉన్నట్లు వివరించారు. సర్వీస్ ఓటర్లు 158 మంది తమ ఓటును నమోదు చేసుకున్నట్లు పేర్కొన్నారు.

నిరంతర కృషితోనే విజయాలు సాధ్యం



రామంతాపూర్ : అరోరా పీజీ కళాశాలలో టెక్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఎంబీఏ, ఎంసీఏ విద్యార్థులకు ఉచిత కంప్యూటర్ కోర్సులను అందించేందుకు నిర్వహించిన ఆన్‌లైన్ పరీక్షలు కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం.మాధవి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు జీవితంలో నిరంతర కృషి తపనతో ఎన్నో విజయాలు సాధించవచ్చన్నారు. టెక్స్ అకాడమీ మేనేజర్ మోహన్‌దాస్ మాట్లాడుతూ.. కోర్సు పూర్తి కాగానే విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని స్పష్టం చేశారు. ఎంసీఏ, ఎంబీఏ విభాగాధిపతులు డాక్టర్ సతీష్‌కుమార్, డాక్టర్ దేవేందర్‌రావులు పాల్గొన్నారు.

IN THE COURT OF THE HON'BLE ADDL SENIOR CIVIL JUDGE: AT BHONGIR
I.A.NO. 62 OF 2023
IN
O.S.NO.118 OF 2019

BETWEEN:
Sangu Andalu ...petitioner/plaintiff
AND
Pothu Anil Babu & others ...Respondent/Defendants

NOTICE

1. M/s. Bhoo Sampada Developers, Flat No.305, 3rd Floor, Plot No.35, New Samathapuri Colony, Road No. 2, Nagole, Uppal, Medchal - Malkajgiri District.
2. Avanaganti Pandu S/o. Avanaganti Gopal, aged about 38 years, Occ: Business, R/o. H.No.3-8-55, Samalawada (Dhobi wada), near Shivalayam, Bhongir Town & Mandal, Yadadri - Bhongir District.
3. Gaddam Kondal Reddy, S/o.Gaddam Sathi Reddy, aged about 40 years, Occ: Business, R/o. H.no:3-11-161/7/A/A/1, LB Nagar, near Singannagudem, Bhongir Town &Mandal, Yadadri Bhongir District.

Respondents/Defendants12 to 14

Please take notice that the above named petitioner / plaintiff filed the above suit for Partition and Separate Possession in respect of the suit schedule property in that the petitioner / plaintiff filed an above I.A for implead the above named proposed respondents / defendants No. 12 to14 and the said I.A is posted to 31-01-2024 for your appearance. Inspite of this notice if you the above named proposed respondents / defendants No. 12 to 14 fails to appear before the above mentioned court on 31-01-2024 at 10:30 AM either in person or through an advocate you will be set ex-parte and the Hon'ble court will be passed appropriate orders
(By order of the court)

Sd/- CH.NarendraPrasad, P.Sreedhar, I. Kistaiah, N.Mahender, M.Srilatha
Advocates Bhongir